ప్రజాశక్తి

బుధవారం 27 నవంబర్ 2024

5

విజయనగరం



కలెక్టర్‌ను కలిసిన టిటిపిఆర్ ఎస్ఇ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఇ తిరుపతిరావు

ప్రజాశక్తి-విజయనగరం

జల వనరులశాఖ (టిటిపిఆర్) పర్యవేక్షక ఇంజినీర్‌గా బాధ్యతలు స్వీకరించిన పివి తిరుపతిరావు మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇంతవరకు ఇక్కడ ఎస్ఇ గా పనిచేసిన సుగుణాకరరావు నార్త్ కోస్టల్ సిఇగా బాధ్యతలు తీసుకోవడంతో తిరుపతి రావుకు ఆ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు, రైతులు, స్కీం వర్కర్లు, పలు ప్రజాసంఘాల నాయకులు

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై

కార్మిక, రైతు, ప్రజా సంఘాల ఆగ్రహం

కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజలకు నష్టం కలిగించే విధానాలు విడనాడాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం కార్మిక, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రజలకు నష్టం కలిగించే విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. ధర్నానుద్దేశించి ఎఐకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, రైతు కూలీ సంఘం (ఎపి) రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ మాట్లాడారు. కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత కూడా తమ విధానాల్లో మార్పు లేదన్నారు. ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం, జనసేన ప్రభుత్వాలు రాష్ట్రంలో అవే విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. సర్వ సంపదలు సృష్టించే కార్మికవర్గం, ప్రజలకు తిండిపెట్టే రైతాంగమని, కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. విశాఖస్టీల్ ప్లాంట్ సహా ఇతర భారీ పరిశ్రమలు, సముద్రతీరాన్ని కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నదని అన్నారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వడం లేదని, సుప్రీంకోర్టు చెప్పినా అంగన్వాడీ,ఆశా, మధ్యాహ్నభోజన, స్కూల్ ఆయాలు, కార్మికులను 'కార్మికులుగా' గుర్తించడం లేదని అన్నారు. ఎంత కాలం పనిచేసినా పర్మినెంట్ చేయకూడదని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, ట్రైనీ, గౌరవవేతనం లాంటి పేర్లతో కార్మికులను అత్యంత దోపిడీ చేస్తున్నాయని అన్నారు. వ్యవసాయ దేశమైన మన దేశంలో కార్మిక వర్గం, రైతాంగం కలిసి ఐక్యంగా పోరాడితేనే మన లక్ష్యం సాధించగలమన్నారు. లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, స్కీమ్ వర్కర్లు, ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, పెన్షన్, గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రుణ సౌకర్యం కల్పించాలని, అసంఘటిత కార్మికులకు సమగ్ర సామాజిక సంక్షేమం చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులను రోజుకు రూ.600 వేతనంతో 200 రోజులకు పెంచాలని, పట్టణాలకు విస్తరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు జి.శ్రీనివాస్, జి.అప్పారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పైడిపునాయుడు, రాకోటి రాములు, ఎఐఎఫ్‌టియు నాయకులు బెహరా శంకర్రావు, రెడ్డి నారాయణ రావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ, అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.గౌరి నాయుడు, బి.సూర్యనారాయణ, మద్దిల రమణ, రైతు సంఘం నాయకులు ఆదినారాయణ, రామకృష్ణ, రవి, మెడికల్ రిప్స్ నాయకులు శ్రీను,మూర్తి, శశిధర్, సుధీర్, ముత్యాలు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎస్.రంగరాజు ఇఫ్టూ నాయకులు మల్లేష్ , పిఒడబ్ల్యుయు నాయకులు పార్వతి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి. అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అలమండ ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

రైతు, కార్మిక సంఘాల ర్యాలీ, రాస్తారోకో



బొబ్బిలి : నిరసన తెలుపుతున్న కార్మిక, రైతు, ప్రజాసంఘాల నాయకులు

బొబ్బిలి : కేంద్రంలో మోడీ విధానాలను నిరసిస్తూ రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి చర్చి సెంటర్ వరకు ర్యాలీ, అనంతరం రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఎఐటియుసి జిల్లా నాయకులు ఎం.శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు, ఇఫ్టూ నాయకులు ఎం.గోపాలం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను మార్చివేసి దాడి చేస్తుందని అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని చట్టం ఉన్నా అమలు చేయడం లేదన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.శ్రీనివాసరావు, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వి.శేషగిరిరావు, కార్మికులు, రైతులు, స్కీమ్ వర్కర్లు పాల్గొన్నారు.

రాజ్యాంగ విశిష్టత అందరికీ తెలియాలి

- కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్
- ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, జెసి సేతుమాధవ్, డిఆర్ఒ, ఆర్‌డిఒ

ప్రజాశక్తి-విజయనగరంకోట

భారత రాజ్యాంగం గొప్పదనం, విశిష్టత ప్రతీఒక్కరికీ తెలియాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. 75వ భారతరాజ్యాంగ దినోత్సవాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మన రాజ్యాంగాన్ని ఆమోదించి మనకి మనం అర్పించుకున్న దినంగా రాజ్యాంగ దినోత్సవాన్ని పేర్కొన్నారు. అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించి, దాని గొప్పదనం ప్రతీఒక్కరికీ తెలియాలన్న ఉద్దేశంతో 2015 నుంచి నవంబరు 26న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రతీఏటా ఘనంగా నిర్వహించు కుంటున్నామని తెలిపారు.ప్రతి ఒక్కరూ రాజ్యాంగం గొప్పదనాన్ని తెలుసుకోవడమే దీని ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ, మన పెద్దలు ప్రపంచంలోని ఉన్నతమైన వివిధ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, మంచిని గ్రహించి మనకు అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ఒక దేశంగా మనుగడ సాధించి నిలదొక్కు కొనడానికి రాజ్యాంగం ఎంతగానో దోహద పడిందని అన్నారు. సిపిఒ పి.బాలాజీ మాట్లాడుతూ, రాజ్యాంగం రూపకల్పన, దాని విశిష్టతను వివరించారు. అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ డి.కీర్తి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి టివి రాజేష్ కుమార్ రాజ్యాంగ పీఠికను కోర్టు సిబ్బంది అందరితో చదివించారు. రాజ్యాంగ యొక్క విశిష్టతను వివరించారు.

అంబేద్కర్ చిరస్మరణీయుడు

విజయనగరం కోట : భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిరస్మరణీయుడని గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి బి. లక్ష్మి అన్నారు. గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ ప్రాముఖ్యత నుతెలుసుకోవాలన్నారు కార్యక్రమంలో సహాయ గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాస్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కూర్మచార్యులు, గ్రంథాలయ సిబ్బంది , పాఠకులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు

జిల్లా పరిషత్ కార్యాలయంలో..

విజయనగరంటౌన్: జిల్లా పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా మనకు వచ్చిన ప్రాథమిక హక్కులను వివరించారు. అంతకుముందు సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిప్యూటీ సిఇఒ ఆర్.వెంకటరామన్, ఇఇ కెజిజె నాయుడు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులతో సమానంగా వేతన మివ్వాలి



డిఆర్ఒకు వినతినిస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో సమానంగా ఇంజినీరింగ్, నాన్ పిహెచ్ కార్మికులందరికీ బేసిక్ వేతనం రూ.21వేలు అమలు చేయాలని, హెల్త్ అలవెన్స్ బకాయిలు చెల్లించాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం డిఆర్ఒ శ్రీనివాసమూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు ఎ .జగన్ మోహన్ రావు మాట్లాడుతూ తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదని అన్నారు. విజయనగరం కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికులకు 3నెలల హెల్త్ అలవెన్స్ బకాయిలు ఉన్నాయని, పంప్ హౌస్, లీకులు, వాల్ ఆపరేటర్లు, ప్లాంటేషన్ తదితర థర్డ్ పార్టీ కార్మికులకు నెల నెల టెండర్ ప్రకారం కాంట్రాక్టర్ చెల్లించడం లేదని తెలిపారు. మున్సిపల్ కార్మికులను 62 ఏళ్ల వరకు కొనసాగించాలని ,రిటైర్ అయిన మరణించిన వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు బాబురావు, నారాయణ రావు, శ్రీను, అర్జున్, రాఘవ, శంకర్రావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఆయాల జీతాలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు, వాచ్‌మెన్‌లకు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే మంజూరు చేయాలనికోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యాశాఖ ఎడి కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బి.సుధారాణి మాట్లాడుతూ ఇచ్చే 6000 కూడా నెలల తరబడి చెల్లించకపోతే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. తక్షణమే జీతాలు చెల్లించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన సిద్ధం కావాల్సి వస్తుందని తెలిపారు. ప్రతి 50 మంది పిల్లలకు ఒక ఆయాను నియమించాలని, గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పిఎఫ్ , సిక్కిలివ్వులు తదితర సౌకర్యాలు కల్పించాలని అన్నారు. వినతిపత్రం వచ్చిన వారిలో యూనియన్ కార్యదర్శి వై.నందిని, ఉపాధ్యక్షులు పార్వతి, నాయకులు ఉమా, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు, గౌరవ వేతనాలు తక్షణమే చెల్లించాలని విద్యాశాఖ ఎడికి వినతినిచ్చారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధారాణి మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకు కనుగుణంగా వర్కర్ల సంఖ్యను పెంచాలని ఇంటర్ వరకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించాలన్నారు. గ్యాస్ ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చిన వారిలో స్వప్న, రమా, నారాయణమ్మ, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పిఎం జన్‌మన్‌తో మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రధానమంత్రి జన్ మన్ కార్యక్రమం ద్వారా కొన్ని ప్రత్యేక గిరిజన తెగల (పివిటిజి) అభివృద్ధికి, వారి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు. గదబ తదితర అతి సున్నిత గిరిజన తెగలు నివసించే గ్రామాలు జిల్లాలోని 7 మండలాల్లో 52 వరకు ఉన్నాయని చెప్పారు. వీటిలో ఐదు గ్రామాలను ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. జెసి ఎస్.సేతు మాధవన్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి బి.రామానందం, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని కాపాడండి

ప్రజాశక్తి-విజయనగరం కోట

హిందూ, ముస్లిం, క్రైస్తవులపై దాడులను అరికట్టి మత సామరస్యాన్ని కాపాడాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు మాట్లాడుతూ లంకాపట్నం ప్రాంతంలో గత 20ఏళ్లగా కులమతాలకు అతీతంగా పెంతుకోస్తు చర్చి నడుపుకుంటున్నామన్నారు. హుదూద్ తుపాను కాలంలో అప్పటి టిడిపి ప్రభుత్వం హుదూద్ బాధితులకు గృహ నిర్మాణాలు ఏర్పాటు చేయాలనే ప్రణాళికతో అక్కడ ఉన్న చర్చిని వేరే దగ్గర ఏర్పాటు చేయాలని ఇప్పుడు ఉన్న చర్చ్ స్థలాన్ని చూపించా రని అన్నారు. ఇటీవల కొంతమంది మనువాద శక్తులు ఆ స్థలంపై కన్ను పడి కబ్జాకు ప్రయత్నిస్తున్నా రన్నారు. నగరపాలక సంస్థ అధికారులు నోటీసులు ఇచ్చి ఖాళీ చేయాలని చెప్పడం అన్యాయమన్నారు. బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు కె.సోములు, పాముల, లక్ష్మణరావు, ఇలియాజ్, లక్ష్మి, మాణిక్యం, ఎర్రయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెల్లి కులస్తులను విస్మరించిన ప్రభుత్వం

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాలకూ కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్ల పదవులు ప్రకటించి రెల్లి కులస్తులను విస్మరించిందని రాష్ట్ర రెల్లి రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్ అర్జి శివప్రసాద్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద రెల్లి కులస్థులు చేపట్టిన చేపట్టిన ఒకరోజు నిరసన దీక్షలో ఆయన మాట్లాడారు. అన్ని కులాలతో సమానంగా రెల్లి ఉప కులాలను గుర్తించాలన్నారు. రనాజీవ్ రంజాన్ మిశ్రా కమిషన్ ప్రాంతాలవారీగా పర్యటిస్తున్నారని, ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కులగణన జరిగిన తరువాతే రిజర్వేషన్లు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో రెల్లి వాటి ఉప కులాల రాష్ట్ర అధ్యక్షులు గండి విజయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు సోము మురళీమోహన్, ఎస్‌సి మోర్చా సెక్రెటరీ సోము మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా మృతుల కుటుంబాలకు వైసిపి ఆర్థిక సాయం

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రాణ నష్టం : బొత్స



మృతుల కుటుంబీకులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ బొత్స

ప్రజాశక్తి-గుర్ల

గుర్లలో గతనెలలో సంభవించిన డయేరియా మృతుల కుటుంబాలకు మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన రూ.2లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ డయేరియా మృతుల పట్ల అధికారులు, ప్రభుత్వం అనుసరించిన తీరు ఆక్షేపనీయమని అన్నారు. గత నెలలో డయేరియాతో మృతి చెందిన మతుల కుటుంబాలను మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.2లక్షలు ఆర్థిక సాయం ప్రకటించారని, కొన్ని కారణాల వల్ల ఆలస్యమైనా, అందజేస్తున్నామని తెలిపారు. గుర్లలో 10 కుటుంబాలకు, కోటగండ్రేడు ఒక కుటుంబానికి, నాగళ్లవలసలో ఇద్దరి కుటుంబాలకు ఈ సాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. డయేరియాను అరికట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లే ప్రాణనష్టం ఎక్కువగా జరిగిందన్నారు. తన రాజకీయా జీవితంలో ఇలాంటి సంఘటన ఎప్పుడూ చూడలేదన్నారు. శాసన మండలిలో ఈ విషయమై ప్రస్తావిస్తే మంత్రి నుంచి సరైన సమాధానం రాలేదన్నారు. జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మృతుల కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం చెయ్యలేని పని వైసిపి చేసిందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ చేతుల మీదుగా మృతుల కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కెవి సూర్య నారాయణ రాజు, జిల్లా నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు జమ్మూ స్వామి నాయుడు, ఇజ్జిరోతు ప్రసాద్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

సుజల స్రవంతికి భూసేకరణ పూర్తి చేయాలి : ఎస్‌డిసి

ప్రజాశక్తి - రామభద్రపురం

సుజల స్రవంతికి భూ సేకరణ పూర్తి చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జోసఫ్ సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయాలన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వేయర్లు, విఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఈ సమస్యలపై దృష్టి సారించాలన్నారు. మండలంలో ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీటిలో ఎన్ని పరిష్కరించారని తహశీల్దార్ సులోచనరాణిని అడిగారు. అధికారుల స్థాయిలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించా లని తెలిపారు. ముఖ్యంగా భూసర్వేలో ఎక్కువ ఫిర్యాదులు రావడంతో స్పష్టంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

సుజల స్రవంతికి 2,500 ఎకరాల సేకరణ

సుజల స్రవంతి ప్రాజెక్టుకు రైతుల నుంచి 2,500 ఎకరాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు పూర్తిచేయడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. తారకరామాసాగర్ ప్రాజెక్టుకు 70 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉండగా ఇప్పటికి 30 ఎకరాలు సేకరించామని, మిగిలినవి త్వరలో సేకరిస్తామన్నారు. తోటపల్లికి 13 ఎకరాలు మాత్రమే భూసేకరణ చేయాల్సి ఉందని, కొన్ని ప్రాంతాల్లో రైతులతో వివాదాల కారణంగా నిలిచి పోయిందని తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అత్యవసర సేవలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో 108 అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలనికలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రవాణా, వైద్య ఆరోగ్య అధికారులను ఆదేశించారు. 108 సిబ్బంది సమ్మెకు వెళ్తున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 108 వాహనాలు 28 ఉన్నాయని వాటిని నడిపేందుకు ఆయా మండలాల్లో లభ్యమయ్యే డ్రైవర్లను గుర్తించి సిద్ధంగా ఉంచాలన్నారు. ఒక్కో వాహనానికి ఇద్దరు చొప్పున పేర్లను గుర్తించి జాబితా సిద్ధం చేయాలన్నారు. ఆర్టీసీలో శిక్షణ పొందిన డ్రైవర్లను గుర్తించి సిద్ధం చేస్తామని ఉప రవాణా కమిషనర్ మణిశంకర్ తెలిపారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.రాణి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రాజేశ్వరి, వాహన తనిఖీ అధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండాలి : కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి నాణ్యతతో పాటు, ప్రతి అంశం పారదర్శకంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. మంగళవారం తన ఛాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద చెరువు, అయ్యకోనేరు, నీలాటి చెరువు, కోమటి చెరువు లను పరిశుభ్రతగా ఉంచాలన్నారు. ఆచంట గార్డెన్ గోడలకు, పెద్ద చెరువు గ్రిల్స్‌కు పెయింటింగులు వేయించాలని సూచించారు. సమావేశంలో ఎంఇ టి. రాయల్ బాబు, టెక్నికల్ ఆఫీసర్ పట్నాల వెంకటేశ్వరరావు, డిఇలు ప్రసాద్, మణికుమార్, ఎఇలు పాల్గొన్నారు.

రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం

నగర ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే ప్రధాన ధ్యేయమని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కొత్త అగ్రహారంలో ఉన్న వాటర్ ట్యాంక్ ను పరిశీలించారు. ప్రతి 15 రోజులకు ఓసారి వాటర్ ట్యాంక్ శుభ్రపరుస్తున్నారా లేదా అని గమనించారు. పైపులైను లీకులను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఫిట్టర్‌కు ఆదేశించారు. ప్రతిరోజు నీటి నాణ్యతను పరీక్షించే క్లోరిన్ టెస్టులు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

వ్యాపారులకు ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి

నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ప్రతి ఒక్క వ్యాపారస్తుడికి ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి అని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాలతో సచివాలయాల వారీగా ఆయా పరిధిలో ఉన్న దుకాణాలకు కార్యదర్శులు వెళ్లి ట్రేడ్ లైసెన్సులు పొందని వారికి లైసెన్సు విధానంపై అవగాహన కల్పిస్తూ ట్రేడ్ లైసెన్సులను మంజూరు చేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ట్రేడ్ లైసెన్స్ విధానం శతశాతం అమలయ్యే విధంగా చూడాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. బకాయి పడ్డ ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ ను వెంటనే చెల్లించాలని సూచించారు.

గ్రేడ్-2 లైన్ మెన్లను సచివాలయాల నుంచి మినహాయించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్ సంస్థ లో పని చేస్తున్న జూనియర్ లైన్ మెన్ గ్రేడ్ 2 వారిని సచివాలయ విధుల నుండి మినహాయించాలని ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104) విజయనగరం జిల్లా కమిటీ మంగళవారం విజయనగరం జిల్లా కలెక్టర్ ని కలిసి వినతి పత్రాన్ని సమర్పించింది. విద్యుత్ సంస్థలో అత్యవసర పనులతో పాటు అనేక విధులు నిర్వహిస్తుండగా అదనంగా సచివాలయ పనులు అప్పగించడం వలన ఏమి చేయాలో సందిగ్ధంలో ఉన్నారని తెలిపారు. విధి నిర్వహణలో కొంత మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. కార్యక్రమంలో రీజనల్ సెక్రటరీ సురగాల లక్ష్మణ్, రీజనల్ అధ్యక్షులు వంగపండు లక్ష్మణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు గేదెల దేముడు, వర్కింగ్ అధ్యక్షులు టి. గంగు నాయుడు, రీజనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్. పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, గాడి అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గిరిజన యూనివర్సిటీ నిర్వాసితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెంటాడ మండలం కుంటినవలసలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి 560 ఎకరాలు భూమిని సేకరించారని, పోరాట ఫలితంగా రైతులకు పరిహారం ఇచ్చినా కొన్ని సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని తెలిపారు. ముఖ్యంగా భూమిపై ఉన్న టేకు, మామిడి తదితర మొక్కలకు డబ్బులు చెల్లించకుండా అన్యాయం చేశారన్నారు. నలుగురు డి పట్టా దారులకు నష్టపరహారం అసంపూర్ణంగా ఇచ్చారన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిఆర్ఒకి వినతి ఇచ్చారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, నిర్వాసిత నాయకులు లింగాల వెంకట్రావు, చాకలి కృష్ణా, పైలు రాములు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

మెరకముడిదాం: మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 29 పంచాయతీల్లో జరిగిన 1733 ఉపాధి పనులపై మంగళవారం ఎంపిడిఒ కార్యాలయ పరిధిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ పనులకు వేతనాలు రూపంలోనూ, మెటీరియల్ రూపంలోనూ సుమారు రూ.36కోట్లు ఖర్చు పెట్టినట్లు సామాజిక తనిఖీ బృంద సభ్యులు తెలిపారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించిన మేరకు రోడ్కు కిరువైపులా మొక్కలు కనిపించకపోవటం, మస్టర్లలో దిద్దుబాట్లు కనిపించటం, కొన్ని పంచాయతీల్లో ఒకే పని మీద రెండు బిది నెంబర్లతో పనులు చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి కళ్యాణ్ చక్రవర్తి, ఎపిడి మీసాల శ్రీనివాసరావు, సామాజిక తనిఖీ అధికారి ఎస్.లక్ష్మణరావు, తాడ్డి వేణుగోపాలరావు, ఎంపిడిఒ భాస్కరరావు, జెఇ నరేంద్రకుమార్, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్ కుమార్, పప్పల కృష్ణమూర్తి, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల అధ్యక్షులుగా గురవాన

రేగిడి: మండల యుటిఎఫ్ అధ్యక్షులుగా గురవాన విష్ణుమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కాగితాపల్లి యుటిఎఫ్ భవనంలో ఈ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా వారాడ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా మురపాక గణేష్, సహాధ్యక్షులుగా బి.విజయలక్ష్మి, బివి గణేశ్వరరావులు, కోశాధికారిగా వి.ప్రవీణ్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్గా సిహెచ్.నారాయణరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా మరి కొంత మంది ఎన్నికయ్యారు. వీరిని జిల్లా కార్యదర్శి పక్కి వాసు అభినందించారు.

వరకట్న దురాచారాన్ని రూపుమాపాలి

బొబ్బిలి: వరకట్న దురాచారాన్ని రూపు మాపాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ కోరారు. స్థానిక కోర్టులో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరకట్నం తీసుకోవడం నేరమన్నారు. వరకట్న దురాచారాన్ని పూర్తిగా రూపుమాపాలని కోరారు. రాజ్యాంగాన్ని కాపాడాలని, రాజ్యాంగానికి లోబడి ఉంటామని, వరకట్న దురాచారాన్ని పూర్తిగా రూపు మాపుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం పరిశీలన

నెల్లిమర్ల: మండలంలోని సీతారామని పేటలో గ్రామంలో మంగళవారం నిర్వహించిన పంట కోత ప్రయోగాన్ని జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు పరిశీలించారు. ఎకరాకు 32.43 క్వింటాలు దిగుబడి రావచ్చు అని అంచనా వేశారు. అనంతరం వరి పంట పొలాలు పరిశీలించి రెల్ల రాల్చు పురుగును గమనించి నివారణకు రైతులు క్లోరోపైరిఫాస్ మందు 500 మిల్లీ లీటర్లు, ఇమామెక్టిన్ బెంజోయేట్ ఎ 100 గ్రాములు వరి పంటలో మొక్క మొదలు భాగా తడిచేలా పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వర్షాలు 29వ తేదీ లోపు పడే అవకాశం ఉన్నందున కోసే పొలం మీద ఉన్న పంటను గాలి కుప్పలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఒ పూర్ణిమ, ఇన్సూరెన్స్ అధికారి అనదీప్, జిల్లా వ్యవసాయ కార్యాలయం ఎస్ఒ చంద్ర శేఖర్, ఎఇఒ నాగరాజు, హేమామహేష్, విఎఎ శ్యామ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రైతులు దళారులను ఆశ్రయించొద్దని, ప్రభుత్వమే కనీస మద్దతుధర కల్పించి ధాన్యం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని సతివాడలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. రైతులు ముందుగానే సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి ఎడిఎ ఎన్ కోటేశ్వరరావు, ఎంపిడిఒ కె. రామకృష్ణరాజు, తహశీల్దార్ పి. సుదర్శన రావు, ఎఒ ఎం.పూర్ణిమ, సిఎస్డిటి, ఇఒపిఆర్డి, జనసేన మండల నాయకులు చనమల్ల వెంకట రమణ, సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం సేకరణకు గోని సంచులతో సహ రవాణా ఛార్జీలను కూడా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. ఇకేవైసీ, ఈ



తెర్లాం: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

పంట నమోదు చేసుకున్న రైతుల వద్ద మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తారని స్పష్టంచ చేశారు. ధాన్యం వాహనంలలో ఎగుమతి చేసిన దగ్గర నుండి రైస్ మిల్లు వద్ద దిగుమతి అయ్యేవరకు జిపిఎస్ పరికరం ద్వారా ట్రాక్ చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఒ సునీల్ కుమార్, తహశీల్దార్ హేమంత్ కుమార్, ఎంపిడిఒ రాంబాబు, ఎంపిపి ఉమాలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు ఎన్ వెంకట్ నాయుడు, మాజీ ఎంపిపి ఎన్ వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ శంకర్రావు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలసలో మంగళవారం ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, దాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని గౌరీపురంలో కృష్ణ మహంతి పురం పిఎసిఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్సీ ఐ.రఘురాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు కూడా కొనుగోలు కేంద్రం వద్ద మాత్రమే ధాన్యం అమ్మాలని , ధాన్యం ఇచ్చిన రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని ఈ అవకాశాన్ని రైతులు అందరు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఒ కె.రవీంద్ర, ఎంపిపి సండి సోమేశ్వరావు, బుల్లిబాబు, మాజీ ఎంపిపి ఒంటి అప్పారావు, పెదకండే పల్లి సర్పంచ్ యాళ్ళ రమణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల బాయ్కట్

నెల్లిమర్ల: నెల్లిమర్ల, పూసపాటిరేగ మండలాల్లో మంగళవారం పలు ధాన్యం కేంద్రాలు ఎమ్మెల్యే లోకం నాగమాధవి ప్రారంభించారు. అయితే ఈ కార్యక్రమాలకు టిడిపి నాయకులకు సమాచారం లేకపోవడంతో వారంతా ఈ కార్యక్రమాలను బాయ్కట్ చేశారు. దీంతో ఎమ్మెల్యే తూతూ మంత్రంగా కేంద్రాలను ప్రారంభించి వెళ్లిపోయారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకువాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జ్యూట్ యాజమాన్యంపై చర్యలు తీసుకువాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన జ్యూట్ మిల్ సమస్య పై తహశీల్దార్ సుదర్శనరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యూట్ యాజమాన్యం ముడి సరుకు (నార) కొరత పేరిట అక్రమంగా లాక్ అవుట్ చేసి గత 6నెలలుగా కార్మికులను ఇబ్బందుల పాలు చేసిందన్నారు. ముఖ్యంగా జ్యూట్ యాజమాన్యం కార్మికుల నుంచి అప్పుగా 5,10,18 రూపాయలు తీసుకుందని ఇంతవరకు చెల్లించలేదు సరికదా రిటైర్డ్ కార్మికులకు గ్రాడ్యూటీ బకాయిలు కూడా చెల్లించలేదని తెలిపారు. జ్యూట్ మిల్ అక్రమ లాక్ అవుట్పై జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విశాఖపట్నం లేబర్ కమిషనర్ వద్ద జాయింట్ మీటింగ్ వేసినా జ్యూట్ యాజమాన్యం గైర్హాజరవుతుందని తెలిపారు. యాజమాన్యం నగర పంచాయతీకి సుమారు 6కోట్ల రూపాయలు పన్ను బకాయి ఉన్నా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో జ్యూట్ యాజమాన్యంపై చర్యలు తీసుకొని మిల్లు తిప్పాలని డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో కార్మికులతో మిల్ స్థలాలు ఆక్రమించుకుంటామని హెచ్చరించారు. కొండ వెలగాడ సీతమ్మ చెరువు ఆక్రమణపై విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

అపరాల సాగుపై అవగాహన ఉండాలి: ఎడిఎ

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

అపరాల పంటలపై రైతులకు అవగాహన ఉండాలని వ్యవసాయశాఖ ఎడిఎ యం.శ్యాంసుందర్ అన్నారు. మంగళవారం కోమటిపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రబిలో అపరాలసాగు పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా అపరాల దిగుబడి తగ్గట్టుకు ప్రధాన కారణాలైన కలుపు మందు వాడకపోవడం, పంటకి సకాలంలో నీటి తడులు, విరివిగా ఎరువులని అందించలేకపోవడం వల్ల ప్రధానంగా దిగుబడులు చాలా తక్కువగా వస్తున్నాయన్నారు. వీటిని అధిగమించడం కోసం రైతు విధిగా మూడు పద్ధతులను తూచా తప్పకుండా పాటించాలని అవగాహన కల్పించారు. ప్రధానంగా మొక్క మూడు ఆకుల దశలో ఉండేటప్పుడు తప్పకుండా కలుపు నివారణ మందును వాడాలని, ఐదు నుండి ఆరాకుల దశ ఉండేటప్పుడు ఎకరానికి ఐదు కేజీలు చొప్పున ట్యాంకు 500 గ్రాములు యూరియా కలిపి పిచికారి చేయాలని చెప్పారు. ఎకరానికి 10 ట్యాంకులు, పూత దశలో 319 అనే నీటిలో కరిగే ఎరువుని ఎకరానికి కేజీ, ఒక పురుగు మందు ఒక తెగులు మందుని పిచికారి చేసుకుంటే దిగుబడులు కనీసం ఒకటి నుండి రెండు క్వింటాళ్లు పెరగడానికి ఆస్కారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పుట్లూరు కిరణ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

దర్యాప్తులో ఉన్న కేసులను ఛేదించాలి : ఎస్పి

ప్రజాశక్తి- రేగిడి

పోలీస్ స్టేషన్లో దర్యాప్తులో ఉన్న కేసులను ఛేదించాలని, శాంతి భద్రతలు అదుపులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద పోలీస్ స్టేషన్ను వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ముందుగా స్టేషన్ గదులు, నేరగాళ్ల గదులు, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులు పరిశీలించి, పోలీస్ టోపీ ఆకారంలో ఉన్న రిసెప్షన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 25 సచివాలయాల మహిళా పోలీసులతో మండల స్థాయిలో శాంతి భద్రతలు, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై నిఘా ఇతర వాటిపై సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామస్థాయి నుంచి నిఘా ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు పోలీస్ స్టేషన్కు గ్రామస్థాయి శాంతి భద్రతలపై సమాచారం అందించాలన్నారు. అక్రమ ఇసుక రవాణా, బెల్ట్ షాపులపై దృష్టి సారించాలన్నారు. స్థానిక ఎస్ఐ నీలావతి, సిబ్బందితో మాట్లాడుతూ ఫిర్యాదుదారులపై సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ప్రతి కేసుకు రసీదు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన రహదారి జంక్షన్లో వాహన తనిఖీలు ముమ్మరంగా చేయాలన్నారు. అనంతరం ఎస్ఐ లీలావతి ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఉత్త మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. స్టేషను పరిసరాలు, లాకప్ సెల్స్, ప్రజలకు క్షేత్ర స్థాయిలో డిజిటల్ అరెస్టు, ఇతర సైబరు మోసాల పట్ల అవగాహన కల్పించాలని, ఏదైనా సైబరు మోసానికి గురైతే 1930కు ఫిర్యాదు చేయాల్సిందిగా ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీసు సిబ్బంది, మహిళా సంరక్షణ పోలీసులను ఆదేశించారు. ఈ వార్షిక తనిఖీల్లో చీపురుపల్లి డిఎస్పి ఎస్.రాఘవులు, రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్ర రావు, ఎస్బి సిఐ ఏవి లీలారావు, సంతకవిటి ఎస్ఐ ఆర్.గోపాలరావు, ఇతర పోలీసు అధికారులు, ఎంఎస్ పిలు, దత్తత పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి-విలేకర్లు

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జిల్లా అంతటా ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొత్తవలస: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిరస్మరణీయుడుని ఎంపిడిఒ రమణయ్య అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తదుపరి సిబ్బందితో రాజ్యాంగ పీఠికను చెప్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఎపిఒ, ఎంఇఒ, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు కోరారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం టిఆర్ కాలనీలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతిఒక్కరికి సమానంగా న్యాయం అందేందుకు అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఎస్ శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలచే రాజ్యాంగ ప్రతిజ్ఞ

బొబ్బిలిరూరల్ : రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేసిన చట్టం గురించి ఉపాధి పనులు జరిగే చోట ఎంపిడిఒ రవి కుమార్, ఎపిఒ లక్ష్మీపతిరాజులు వివరించి వారిచేత ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాజ్యాంగం మనకు కల్పించిన హక్కుల గురించి కూలీలకు వివరించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ యం.శ్రీను, రాజ్యాంగ ప్రతిజ్ఞ సిబ్బంది, విద్యార్థులతో చేయించారు.

రామభద్రపురం: రాజ్యాంగాన్ని గౌరవించడం దేశ ప్రజలందరి ఉమ్మడి బాధ్యతని రాజ్యాంగం పవిత్ర గ్రంథమని దాన్ని సంరక్షించటం, గౌరవించడం పాలకుల, ప్రజల కర్తవ్యమని కారుణ్యా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, నాయుడువలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెసి రాజు తెలిపారు. మంగళవారం పాఠశాలలో 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను విద్యార్థులు,ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు రవికుమార్ విద్యార్థులచే రాజ్యాంగ పీఠికను చదివించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి వేణు, కృష్ణంనాయుడు, వెంకట రమణ, బొప్పే రవికుమార్, కృష్ణ, సత్యం విద్యార్థులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవంతో పాటు సాంఘిక శాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించినట్లు హెచ్ఎం బి ఉమామహేశ్వరరావు తెలిపారు. ఎస్ఎంసి చైర్మన్ లోతేటి ఈశ్వరరావు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఓటరు అక్షరాస్యత వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గ్రంథాలయ అధికారి డి శ్రీధర్, వేదిక ప్రతినిధి ఆర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పుణ్యగిరి వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని శ్రీనివాస కాలనీలో గల సామాజిక భవనంలో నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు గోవింద ప్రకాష్ శర్మ, ఉపాధ్యక్షుడు గనివాడ బాపు నాయుడు, కార్యదర్శి ముగ్గు ధర్మారావు, సహాయ కార్యదర్శి హనుమాల శెట్టి నానాజీ, స్థానికులు మట్ట వీరభద్రరావు, శ్రీనివాసరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

గరివిడి : స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం రాజ్యాంగ విలువలను ప్రోత్సహించడానికి విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవం పైఅవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ మాట్లాడుతూ దేశంలో నివసించే అన్ని మతాల ప్రజల మధ్య ఐక్యత, సమానత్వం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ, ఎఒ జి.అనిల్ కుమార్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: తహశీల్దార్ కార్యాలయం సమీపంలో బహుజన సమాజ్ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గం అధ్యక్షులు ఎరుకొండ వెంకటరావు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉత్తరాంధ్ర మాల మహానాడు అధ్యక్షులు బి గోపాలరావు, న్యాయ ఉద్యమ వేదిక జిల్లా గంటానా అప్పారావు, న్యాయవాది పచ్చిపాల గుర్నాథరావు తదితరులు పాల్గొన్నారు. చెరుకుపల్లిలో గంట నర్సింగ్ రావు, నందిగాంలో ముక్కు గణపతిరావు, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎం.సురేష్, మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారి కామేశ్వరరావు, ఇఒపిఆర్డి గాయత్రి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

డైట్లో 75వ రాజ్యాంగ దినోత్సవం

నెల్లిమర్ల: ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో 75వ రాజ్యాంగ దినోత్సవం మంగళవారం డైట్ ప్రిన్సిపాల్ జి. పగడాలమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబూ రాజేంద్రప్రసాద్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులార్పించారు. సాంఘిక శాస్త్రం అధ్యాపకులు మాతా రామకృష్ణ ఇచ్చిన అంబేద్కర్ విగ్రహాన్ని ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. చాత్రో పాధ్యాయుల క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పలువురు జాతీయ నాయకుల వేశాధారణ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు పి.రవి కుమార్, స్టాఫ్ సెక్రటరీ డి. ఈశ్వర రావు పాల్గొన్నారు.

మిమ్స్ మెడికల్ కళాశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో మిమ్స్ యాజమాన్య ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి, గాంధీ విగ్రహానికి తహశీల్దార్ హేమంత్కుమార్ మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాంబాబు, ఎంఇఒ త్రినాధరావు, ఎపిఒ సుశీల, విఆర్ఒలు, పంచాయతీ సెక్రెటరీ, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజాం: స్థానికమండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఎంపిడిఒ శ్రీనివాసరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కృష్ణంరాజు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిటి రాజశేఖర్, పాల్గొన్నారు.

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో

విజయనగరం టౌన్ : గిరిజన విశ్వవిద్యాలయమ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి. వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని, ముఖ్య అతిదిగా విచ్చేసిన మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పూర్వ వైస్ఛాన్సలర్ మహ్మద్ మియాన్ మన రాజ్యాంగ రూప శిల్పి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలను అర్పించి రాజ్యాంగ ప్రవేశిక ను సామూహిక పఠనం చేయించారు

సత్య డిగ్రీ కళాశాలలో

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావు మాట్లాడుతూ 1949 నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్ ఆమోదించగా 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చిందని తెలిపారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, ఎన్ సి సి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్య వేణి, లెఫ్టినెంట్ ఎం. ఉదయ్ కిరణ్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బి.సూరపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవిస్తూ నడుచుకోవాలి

విజయనగరం కోట : భారత రాజ్యాంగాన్ని గౌరవించి అనుసరిస్తూ నడుచుకోవాలని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. నారాయణ పబ్లిక్ స్కూల్లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగ విశిష్టతపై వ్యాసరచన, వకత్వ పోటీలను నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు



విజయనగరం : విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిబిఎస్యు నాయకులు

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

విజయనగరం టౌన్ : దళిత బహుజన శ్రామిక యూనియన్ ఆధ్వర్యంలో గంజిపేట అంబేద్కర్ మండపం వద్ద రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ పీఠిక ను దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు సభ్యులందరితో ప్రతిజ్ఞ చేయించారు. భారత రాజ్యాంగాన్ని గౌరవించడమే అసలైన దేశభక్తి అని తెలిపారు. దళిత రైట్స్ కన్వీనర్ పాండ్రంకి రమణ, గంజిపేట యువజన సంఘం సభ్యులు బూసర వరప్రసాద్, డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కోఆర్డినేటర్ వరలక్ష్మి, దళిత బహుజన శ్రామిక మహిళా కన్వీనర్ సత్యవతి పాల్గొన్నారు.

గురజాడ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం

విజయనగరం టౌన్ : రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గురజాడ పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధులుగా న్యాయవాదులు గేదెల సత్యం, పి.చిట్టి బాబు, పివైఎస్ సాయి పవిత్ర హాజరై భారత రాజ్యాంగ గొప్పతనాన్ని వివరించారు. పాఠశాల డైరెక్టర్ ఎంవిజిఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. అనంతరం జనరల్ నాలెడ్జి టాలెంట్ టెస్ట్ లో ప్రతిభ చూపిన 38 మంది విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం. స్వరూప, హెచ్ఎం పూడి శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని గ్రంథాలయాధికారి మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్.అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండల పరిషత్ కార్యాలయంలో బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఎంపిడిఒ సురేష్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి రఘునాథ చారి, ఎపిఒ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లిమర్ల: మిమ్స్లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు, యాజమాన్య ప్రతినిధులు

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు

మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగాన్ని అమలు చేయకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు విమర్శించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమలైతే రాష్ట్రంలో మాత్రం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసి వైసిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కన్వీనర్ శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు చోడగంజి రమేష్ నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు ఉత్తరవల్లి అప్పలనాయుడు, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వేపాడ: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్తు ఆవరణలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ అంబేద్కర్ సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సత్యవంతుడు, జెడ్పిటిసి సేనాపతి అప్పలనాయుడు, తహశీల్దార్ జె.రాములమ్మ, మండల స్థాయి అధికారులు, వెలుగు ఎపిఒ, ఎంఇఒ, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని మంగళవారం మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి, ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో టిడిపి ఏంటో అందరికీ తెలిసిందేనన్నారు. ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, రాష్ట్ర కార్య దర్శి పతివాడ తమ్మునాయుడు, విశాఖ నార్త్ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు, డెంకాడ మాజీ జెడ్పిటిసి పతివాడ అప్పలనారాయణ, పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఆకిరి ప్రసాద్ రావు, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మిల్లర్ల యజమానులతో సమావేశం

తెర్లాం: మండలంలోని మిల్లర్ల యజమానులతో మంగళవారం తహశీల్దార్ హేమంత్ కుమార్ సమావేశం నిర్వహించారు. రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు రైతులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని సూచించారు. రైతులు దగ్గర నుంచి ఒక కేజీ కూడా అదనంగా తీసుకోకుండా కొనుగోలు చేయాలని చెప్పారు. రైతులు వాహనాలు మీద ధాన్యం తీసుకొని వచ్చేటప్పుడు దిగుమతి కోసం ఏ రకమైన ఇబ్బంది పెట్టకుండా తక్షణమే దిగుమతి చేసి రైతులను పంపించాలని సూచించారు. రైతులకు ఏ రకమైన ఇబ్బంది కలిగించినా సహించేది లేదన్నారు. బయటి నుంచి వచ్చిన వ్యాపారస్తులు మండలంలో ఉన్న మిల్లులుకు ధాన్యం రానివ్వకుండా కొనుగోలు చేసి బయటకి తీసుకొని వెళ్ళిపోతున్నారని మిల్లర్లు తహశీల్దార్ దృష్టికి తీసుకురాగా చెక్ పోస్టుల ద్వారా మండల నుంచి బయటికి ధాన్యం వెళ్ళకుండా చూస్తామని మిల్లర్లకు హామీ ఇచ్చారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విజయనగరం కోట: దుపాడ గ్రామ సమీపాన పాపాన చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్ఐ హరిబాబునాయుడు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలియనందున మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. మృతుని వయస్సు 30-35 ఏళ్ల మధ్య ఉంటుందని, శరీరం పై ముదురు నీలం రంగు ఫుల్ హాండ్స్ షర్ట్, పసుపు రంగు చెక్ తువ్వాలు ఉందన్నారు. సమాచారం తెలిసిన వారు ఎస్ఐ 8499004114, నెంబర్కు తెలియజేయాలని కోరారు

లారీ ఢీకొని యువకుడు మృతి

తెర్లాం: మండల కేంద్రంలోని మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెర్లాంకు చెందిన కాత్రకోన చందు (18) మృతి చెందాడు. ఇంటి దగ్గర టిఫిన్ కోసమని ద్విచక్ర వాహనంపై మెయిన్ రోడ్డు మీదకు వస్తుండగా లారీ ఢీ కొట్టి యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. డిగ్రీ చదువుతున్న కొడుకు మరణ వార్త విని తల్లిదండ్రులు బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఎస్ఐ సాగర్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు వాహనాలు ఢీకొని నలుగురికి గాయాలు

రామభద్రపురం: బొలెరో, లారీ ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ రహదారిపై సోమవారం అర్థరాత్రి బొలేరో వాహనాన్ని లారీ ఢీ కొట్టింది. విశాఖ పట్టణం నుంచి కొమరాడ వెళుతున్న బొలేరో వాహనాన్ని రామభద్రపురం నుంచి విజయనగరం వెళుతున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బొలేరో వాహనంలో ప్రయాణిస్తున్న కొమరాడ మండలం పూణేశు గ్రామానికి చెందిన హిమరిక పకీరు, కొండగొర్రి నరసన్న, ఉయ్యక గణపతి, కొండగొర్రి సుశీల గాయపడ్డారు. వీరిని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఎస్ఐ వెలమల ప్రసాదరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.